


# ఫస్ట్ స్మోక్!

మోర్తల ప్రభాకర్ రెడ్డి

**బహిరంగ ప్రదేశాల్లో పొగత్రాగడం నిషేధం!**

**న్యూస్‌పేపర్లో హెడ్డింగ్ చూసి త్రుళ్ళిపడ్డాడు ధూమేష్. ఆత్రంగా మిగతా న్యూస్ వివరాలు చదివి డీలాడిపోయాడు. ఒక్క ఇల్లూ స్మశానం తప్ప దాదాపు అన్ని ఏరియాలు కవర్ చేయడమే కాకుండా చట్టాన్ని అతిక్రమించిన వారికి ఐదువేల జరిమానాతోపాటు, ఆరునెల్ల జైలుశిక్ష కూడా బహుమానంగా ఏర్పాటు చేసారు.**

**ఛీ! ఇక ఎలా చావడం? ఇంట్లో తాగడం అనే లగ్జరీని శోభనం రాత్రే త్యాగం చేసాడు. ఇన్నాళ్ళు బయట తాగి, 'కుతి' తీర్చుకుని ఎలాగో తన తంటాలు తను పడుతున్నాడు.**

ఆ దుర్దినం ఇప్పటికీ అతనికి బాగా గుర్తు. ఏడేళ్ళ క్రితం- శోభనం గదిలోకి లల్లాదేవి సిగ్గుపడుతూ వచ్చింది. ఆమె రాకకోసం ధూమేష్ అసహనంగా ఎదురుచూస్తూ సిగరెట్ పొగతో, అగరొత్తులతో పోటీపడుతూండగా, లల్లాదేవి రంగ ప్రవేశం చేసింది. చిద్విలాసంగా పొగ మేఘాలు సృష్టించడంలో బిజీగా ఉన్న ధూమేష్ వైపు అదేదో రకంగా చూసి, ఆ వెంటనే అతని చేతిలో సిగరెట్ లాగి విసిరేసింది.

ఆమె వేసిన మొదటి ప్రశ్న "మీకు ఈ అలవాటు ఎప్పట్నుంచి?"

ధూమేష్ ఆమెని కరెక్ట్‌గా అపార్థం చేసుకుని "ఛీ! పోదూ..నీది మరీ చోద్యం! నీలాగే నాకు ఇదే ఫస్ట్ నైట్" అంటూ తొండం లాంటి చేతిని వడ్డాణంలా ఆమె నడుం చుట్టూ బిగించాడు.

లల్లాదేవి ధూమేష్ చేతిని అవలీలగా పక్కకి నెట్టి "నేనడిగింది సిగిరెట్ల గురించి" అంది చురుగ్గా చూస్తూ.

ధూమేష్ మరో సిగిరెట్ వెలిగించి, పొగతో చేగోడీలూ, జిలేబీ చుట్టలు చుడుతూ "ఓ దీని గురించా..చాలా చిన్నప్పట్నుంచే.." అన్నాడు అదేదో యోగ విద్య అయినట్టు గర్వంగా.

మరోమాట లేకుండా లల్లాదేవి బైటికెళ్ళిపోయి నాలుగు నిమిషాల తర్వాత వచ్చి "అగ్గిపెట్టె ఇస్తారా?" అంది తీక్షణంగా.

"ఓ! నీకూ స్మోకింగ్ హేబిట్ వుందా. అయితే నువ్వు చాలా ఎడ్వాన్స్‌డ్ అన్నమాట. గో ఎ హెడ్. నాకలాంటి పట్టింపులేం లేవులే.." అంటూ రెండడుగులు ముందుకేసి అగ్గిపెట్టె ఇవ్వబోయి కిరోసిన్ వాసన గుఫ్‌మని కొట్టడంతో లల్లాదేవి తదుపరి ప్రోగ్రాం అర్థమైపోయి, ధూమేష్ అమాంతం ఆమె కాళ్ళ మీద పడిపోయిపోయాడు. క్షుద్ర దేవతలా నిలబడి వున్న భార్యవైపు భయంతోపాటు భక్తిగా చూస్తూ దండాలు పెడుతూ తన రెండు చెంపలూ రీసౌండింగ్ ఎఫెక్ట్‌తో వాయించుకో సాగాడు. తనకు అన్యాయం చెయ్యొద్దని భోరున ఏడవ సాగాడు. కాసేపటికి లల్లాదేవి మొండి మనసు కూడా కొంత కరిగింది. 'ప్రోగ్రాం' తాత్కాలికంగా వాయిదా వేసి ధూమేష్ చేత యిక సిగిరెట్స్ వైపు కన్నెత్తకుండా కూడా చూడనని ఆమెకు తెలిసిన దాదాపు నూటా యాభైమంది చిన్నా చితక దేవతల మీద ఒట్టు వేయించింది.

అప్పట్నుంచీ ధూమేష్ ఇంట్లో ఉన్నంత సేపూ ఏదో పోగొట్టుకున్నట్టు... బయట ఉన్నప్పుడు, ఎవరెవరో పోగొట్టుకున్నవేవో దొరికినట్టు ఉండేవాడు.

ఇంటికెళ్ళేప్పుడు లల్లాదేవికి దొరికిపోకుండా తూఫాన్ జర్దానించి, జామాకుల వరకూ నానా ప్రయోగాలు చేసేవాడు.

ఇవ్వాల్టితో బయట సిగరెట్లు తాగే అవకాశం అదృష్టం ఇక లేనట్టే. ఎంత అన్యాయం? ఎందుకిక ఈ పాడు బ్రతుకు?

ఆరోజు..ధూమేష్ ఆఫీసులో అడుగు పెడుతూనే..ఏదో జరగరానిదే జరిగుంటుందని ఊహించాడు. సీనియర్ అసిస్టెంట్ ఏకాంబ్రేశ్వర్రావుని పోలీసులు పట్టుకెళ్ళారని పాండురంగం బిత్తర చూపులు చూస్తూ చెప్పాడు. ధూమేష్ నిట్టూర్చి "నేను ఎప్పట్నుంచో మొత్తుకుంటున్నాను. లంచాలకీ ఒక పద్ధతి, లిమిట్ ఉంటుంది. పార్టీలని అలా పీడించా

ద్దని..ఎవడికో ఎక్కడో కాలి ఉంటుంది" అన్నాడు చిరాగ్గా.

"అబ్బా..అందుకు కాదు గురూ..మనవాడు వరండాలో స్మోక్ చేస్తుంటే స్పెషల్ స్క్వాడ్ వాళ్ళు పట్టుకుపోయారు" పాండురంగం అనవసర విన్యాసాలు చేస్తూ చెప్పాడు.

సిగిరెట్ ప్యాకెట్ బైటికి తీయబోతున్న ధూమేష్ ఓ క్షణం బిగుసుకుపోయాడు.

"ఆ..అందుకా!" అంటూ నోరెళ్ళబెట్టాడు. ఆ షాక్ ఎంతోసేపు కొనసాగలేదు. పది నిమిషాల్లో అలవాటైన 'కుతి' మొదలైంది. మెరుపులా ఓ ఆలోచన మెరిసి గబగబా టాయ్‌లెట్ వైపు దూసుకుపోయాడు.

ఎన్నడూ లేంది, రేషన్ షాప్ ముందు వుండే చాంతాండంత పొడవాటి 'క్యూ' కనిపించిందక్కడ.

అందరికన్నా మొదట ప్రవేశించిన ఆంజనేయులు, జారిపోతున్న ప్యాంట్‌ని పట్టుకుని పిచ్చిచూపులు చూస్తూ బైటికి వొచ్చాడు. అతని చేతిలో వెలగని సిగరెట్ వుంది. అందరూ కోరస్‌లో అడిగిన ప్రశ్నకి జవాబుగా టూరిస్ట్ గైడ్‌లా బాత్‌రూంలో ఓ మూల చూపించాడు. అక్కడ ఓ క్లోజ్ సర్క్యూట్ టీ.వీ. కెమెరా కనిపించడంతో మరుక్షణం చెట్టుకొకరు-పుట్టకొకరుగా పారిపోయారంతా.

సాయంత్రానికి ధూమేష్ పరిస్థితి దారుణంగా మారింది. కుతి ఆపుకోలేక, ఇంటికెళ్ళేదారిలో కనిపించిన ఓ పాడుబడ్డ దిగుడు బావిలోకి దిగి, ఆబగా రెండు దమ్ములు లాగాడో లేదో "ఓకే యూ ఆర్ అండర్ అరెస్ట్" అన్న సినిమా డైలాగ్ వినిపించి అవాక్కయి పైకి చూసాడు. మఫ్టీలో ఉన్న నలుగురు పోలీసులు కనిపించడంతో కాపీ కొడుతూ పట్టుబడ్డ స్టూడెంట్‌లా సిగ్గుపడుతూ నిలబడ్డాడు.

"వెయ్యి రూపాయలు...ఆర్నెల్లు జైలు" ఏదో వరం ఇస్తున్నట్టు ఆఫర్ యిచ్చాడో పోలీసు.

అర సెకండ్‌లో డిసైడ్ అయిపోయి వెయ్యి రూపాయలూ వాళ్ళ చేతిలో పెట్టాడు. రశీదు అడిగే ధైర్యం అతను చెయ్యలేదు. వాళ్ళకెలాగూ ఇచ్చే ఉద్దేశ్యం కూడా లేదు. "మీలాంటి ఎద్యుకేటెడే చట్టాన్ని గౌరవించకపోతే ఎలా? టూ బ్యాడ్..ఇలాంటిది మళ్ళీ రిపీట్ చెయ్యకండి. అన్నట్టు ఆ అగ్గిపెట్టె ఓసారి యిస్తారా?" నలుగురూ సిగరెట్స్ ముట్టిచ్చి తీరిగ్గా వెళ్ళిపోయారు.

ఆ రాత్రి ధూమేష్‌కి, తన్నో గదిలో వేసి తాళం వేసినట్టు..ఆ గది నిండా సిగిరెట్లు గుట్టలు..గుట్టలుగా పడి ఉన్నట్టు..ఎంత ప్రయత్నించినా ఒక్క అగ్గిపుల్ల కూడా వెలగనట్టు..కల వచ్చింది. తెల్లారేసరికి అతను మంచం మీద లేడు. అబ్బ ఎంత భయంకరమైన కల! అనుకున్నాడు ధూమేష్.

మర్నాడు ఆఫీసుకెళ్ళేసరికి ఒకరిద్దరు పనిపిచ్చోళ్ళను తప్పించి దాదాపు ఆఫీసంతా ఖాళీగా కనిపించింది. ఇంతలో ఆంజనేయులు శతృగూఢచారిలా వచ్చి గుసగుసలుగా

"మనవాళ్ళంతా అటెండరు ఆగమయ్య ఇంటికెళ్ళారు" అన్నాడు.

"ఏం ఏదైనా ఫంక్షన్ గానీ.." అంటున్న ధూమేష్‌ని జాలిగా చూసి

"ఫంక్షనా పాడా..వాడు వాడి పాకలో సిగిరెట్లు తాగే ఏర్పాటు చేసాడు. గంటకి పది రూపాయలు ఛార్జీ వసూలు చేస్తున్నాడు. ఏం నువ్వు" ఆంజనేయులికి మిగతాది పూర్తి చేసే ఛాన్స్ రాలేదు. కారణం అప్పటికే ధూమేష్, ఒక్కరోజుకే 'బ్రహ్మంగారి మఠంలా' ప్రాచుర్యం పొందిన ఆగమయ్య పాకలో ఉన్నాడు.

పెద్దసైజు బాత్‌రూంలా ఉన్న ఆ పాకలో తమ ఆయుష్షు, ఆరోగ్యాలను అర్థంతరంగా ఏక కాలంలో తగ్గించుకునే ప్రోగ్రాంలో దజనుమంది పొగరాయుళ్ళు బిజీగా కనిపించారు. కొందరు కుతి ఎక్కువై రెండు, మూడు ఒకేసారి కాలుస్తున్నారు. స్మోక్ బాంబ్ పడ్డట్టుందక్కడ. ధూమేష్ తడుముకుంటూ వెళ్ళి ఆగమయ్యకి ఎంట్రీ ఫీస్ యిచ్చి గబగబా నాలుగు సిగరెట్లు ఊదేసి ఆ పూటకి తన కోటా పూర్తిచేసుకున్నాడు.

ఆగమయ్యలు గల్లీకొకరు పుట్టాలని మనసారా కోరుకున్నాడు ధూమేష్.

మర్నాడు ఆఫీసుకెళ్ళే ముందే రెండు పీకలు లాగిద్దామని ఆగమయ్య పాకకి వెళ్ళేసరికి అక్కడ సీను చూసి నోరెళ్ళబెట్టాడు ధూమేష్. పాక స్థానంలో బండెడు బూడిద, సగం కాలిన వెదురు బొంగులూ కనిపించాయి. ఓ మూల పదవిపోయిన మంత్రిలా ఆగమయ్య కుళ్ళి కుళ్ళి ఏడుస్తూ కనిపించాడు. ఆగమయ్యకి జరిగిన నష్టానికన్నా..తమకో మంచి స్థావరం మంట కలిసినందుకు కొందరు పొగబాబులు ఆగమయ్యకి సాయంగా ఏడుస్తున్నారు.

"రాత్రి పాకలో చోటు లేదన్నందుకు ఎవడో కత్తిగట్టి నా యావదాస్తి బుగ్గిపాలు చేసాడు సారూ" అంటూ ధూమేష్ అడక్కుండానే చెప్పాడు ఆగమయ్య. ధూమేష్ చాలా డీలాపడ్డాడు. అవసరం పరిష్కారాన్ని ఆటోమేటిక్‌గా చూపిస్తుంది. బాగా ఆలోచించి గోలుకొండకి బయలుదేరాడు. ఆ కొండగుట్టల్లో అయితే నిశ్చింతగా ఎన్ని సిగిరెట్లయినా తాగొచ్చు. ఎవ్వడూ పట్టించుకోడు. ఎంతో కష్టపడి కోట పై భాగానికి చేరుకున్నాడు. అంతా నిర్మానుష్యంగా ఉంది. ఓ పాడుబడ్డ గుహలోకి దూరి, లొట్టలేస్తూ, సిగరెట్ నోట్లో పెట్టుకోబోతూ ఆగాడు. ఓ మూల నక్కి, నక్కి ఇద్దరు తన్మయత్వంగా గంట చుట్టలు తాగుతూ..ఫ్యాక్టరీ గొట్టాల్లా పొగలు చిమ్ముతూ కనిపించారు.

ఉన్నట్టుండి పెద్ద సైరెన్ మోగింది. మరుక్షణం నలుగురు పోలీసులు పరిగెత్తుకొచ్చి ఆ పొగరాయుళ్ళని బండబూతులు తిడుతూ..సంకెళ్ళేసి బర..బరా లాక్కుపోయారు.

అప్పటికే ధూమేష్ తెలివిగా సిగిరెట్ ప్యాకెట్ అవతల పారేసాడు. "మీరూ స్మోక్ చెయ్యడానికొచ్చారా?" అనుమానంగా చూస్తూ అడిగాడో పోలీసు.


"ఛీ..నాకు సిగరెట్స్..అన్నా..ఆ స్మోక్ అన్నా పరమ ఎలర్జీ..యాక్..వాక్..నాకు కొండలూ...గుహలంటే ప్రాణం" అని ఓవర్ యాక్షన్ చేసి ఎలాగో బైటపడ్డాడు ధూమేష్.

అతనికి ఏడుపూ విరక్తి కలిగాయి. ఎందుకీ పాట్లు..సిగరెట్లు మానెయ్యడం ఉత్తమం..కానీ ఎలా?

ఆ సాయంత్రం ధూమేష్ ప్రొ.మాయామశ్చీంద్రని కలిసాడు. తలంతా పండిపోయి..పీచు మిఠాయి

## తమన్నా క్రేజ్!

'హ్యాపీడేస్'తో కెరీర్‌లో హ్యాపీగా ముందుకెళ్లే మహద్భాగ్యాన్ని కొట్టేసిన తమన్నా ఇప్పుడు టాలీవుడ్‌లో ప్రముఖ హీరోల సరసన నటించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలని పెద్దలు అన్నారుగా, అందుకనే తమన్నా తనకి ఈ డిమాండ్ వచ్చింది కాబట్టి తన పారితోషికాన్ని కూడా అమాంతం పెంచేసిందిట. ఆమె ఇప్పుడు సినిమాకి **20** లక్షల దాకా డిమాండ్ చేస్తోందని సినీ ట్రేడ్ వర్గాల ఉవాచ.



లాంటి గెడ్డంతో మశ్చీంద్ర కొండబూచాడిలా ఉన్నాడు.

"మీరెంత కాలంగా స్మోక్ చేస్తున్నారు?" అన్నాడు మశ్చీంద్ర కళ్ళజోడు సవరించుకుంటూ.

ధూమేష్ కాళ్ళూపుతూ "నాకూ ఊహ తెలిసినప్పట్నుంచి" అద్భుత విషయం చెబుతున్నట్టు అన్నాడు.

"ఆమె ఎప్పట్నుంచి తెలుసు..అనబోయి..బదులుగా సిగిరెట్లు ఎందుకు తాగాలనిపిస్తుంది" అన్నాడు ఖళ్..ఖళ్ మని దగ్గుతూ మశ్చీంద్ర.

"నాకు సంతోషం కలిగినా బాధ కలిగినా పనిలో బిజీగా ఉన్నా ఏమీ తోచక తీరిగ్గా ఉన్నా" అంటూ మరేదో చెప్పబోయాడు ధూమేష్.

"చెప్పింది చాల్లే..వెధవ సొద! ఇక నిన్నెవ్వడూ బాగు చెయ్యలేడు..అయినా ప్రయత్నిస్తాను" హఠాత్తుగా ఆగిపోయాడు మాయామశ్చీంద్ర.

కారణం అప్పటికే ధూమేష్ సిగరెట్ పొగ..గుప్..గుప్‌మని మశ్చీంద్ర మొహం మీదికి ఊదసాగాడు.

అందుకు ధూమేష్‌ని చివాట్లు పెట్టాల్సింది పోయి, మశ్చీంద్ర పొగకి దగ్గరగా జరిగి, తన్మయత్వంగా అది పీలుస్తూ ఖళ్..ఖళ్‌మని రిథమిక్‌గా దగ్గడం గమనించిన ధూమేష్‌కి ఆశ్చర్యంతోపాటు అనుమానం కూడా కలిగింది. మశ్చీంద్ర మానసిక స్థితిమీద.

రెండు నిమిషాల తర్వాత మశ్చీంద్ర మైకం వొదిలింది.

"ఇప్పుడు మిమ్మల్ని మీ బాల్యంలోకి తీసుకెళుతున్నాను" అన్నాడు ఓ చెయిన్ తీస్తూ దానికి వృత్తాకారంలో ఉన్న ఓ లాకెట్ వేలాడుతోంది.

"నేను రాను. నాకు ఓపిక లేదు. నేనిక్కడే ఉంటాను. కావాలంటే మీరెళ్ళి రండి" అన్నాడు ధూమేష్ నిర్లక్ష్యంగా.

"మీరు కోపరేట్ చెయ్యాలి. లేకపోతే నేనేం చెయ్యలేను" నిష్ఠూరంగా అన్నాడు మశ్చీంద్ర.

ఆ తర్వాత ధూమేష్ మశ్చీంద్ర చెప్పినట్టు విన్నాడు. సెషన్ పూర్తయి ధూమేష్ వెళ్ళిపోతుంటే "ఈసారి వొచ్చేప్పుడు గంట చుట్టల ప్యాకెట్ తీసుకురావడం మరిచిపోవద్దు" అని మశ్చీంద్ర అరవడం వినిపించింది.

ఆ తర్వాత ధూమేష్ మరో నాలుగు 'సెషన్స్' ఎటెండ్ చేసాడు. ఆఖరిరోజు ధూమేష్ వెళ్ళిపోతుంటే మశ్చీంద్ర తృప్తిగా నిట్టూర్చి "మీరు చాలా మంచి పేషెంట్. బాగా కోపరేట్ చేసారు. నాకు చాతనైంది నేను చేసాను. అయినా మీరు నేను రాసిన హౌ టు స్టాప్ స్మోకింగ్ యిన్ సెవెన్ డేస్ అనే పుస్తకాన్ని తప్పక చదవండి" అన్నాడు.

ధూమేష్ యథాలాపంగా "అదెక్కడ దొరుకుతుంది?" అని అడిగాడు.

"సింపుల్... స్మశానాల దగ్గర..క్యాన్సర్ హాస్పటల్స్‌లో" తాపీగా చెప్పాడు మశ్చీంద్ర.

ధూమేష్..సిగిరెట్లు మానేసిన విషయం ఆ నోటా ఈ నోటా పాకి చివరికి 'గమ్యం' అంటే లల్లాదేవికి కూడా చేరింది.

భర్త చాటుగా బైట సిగిరెట్లు తాగుతాడనే విషయం ఆమెకి ఎప్పుడో తెలుసు. మరీ కట్టడి చేస్తే మొదటికే మోసం వస్తుందని. తనకు భయపడి కనీసం యింతకాలం ఇంట్లో అయినా మానేసాడు. అదే చాలు అని సరిపెట్టుకుంది లల్లాదేవి.

మొగుడ్ని అంత తేలిగ్గా నమ్మలేదు ఆమె. రకరకాల బ్రాండ్‌లు అతని ముందు పెట్టి తాగమని ఎంతో బలవంతం చేసింది. అయినా ధూమేష్ తన 'శీలం' కోల్పోలేదు. తృప్తిగా ఫీలైంది లల్లాదేవి.

ఓ రోజు ధూమేష్‌తో కలిసి హోటల్ కెళ్ళింది. పక్క టేబిల్ దగ్గర కూర్చున్న ఓ వ్యక్తి అదే పనిగా పొగ వదులుతూ కనిపించాడు. ధూమేష్ ముక్కు మూసుకుని మొహం అసహ్యంగా పెట్టాడు. మరో నిమిషం తర్వాత ఆపుకోలేక గబగబా వెళ్ళి వాష్ బేసిన్‌లో వాంతి చేసుకున్నాడు. ఆ తర్వాత స్మోక్ చేస్తున్న వ్యక్తిని బండబూతులు తిట్టి, పోలీసులకి పట్టిస్తానని కూడా బెదిరించాడు.

ఇదంతా చూస్తున్న లల్లాదేవి, భర్తలో వచ్చిన మార్పుకి మురిసి ముక్కలైంది.

సిగిరెట్లని..అది తాగేవాళ్ళనూ ఇంకా తిడుతూనే బిల్లుకట్టి లల్లాదేవితో బైటికొచ్చాడు ధూమేష్.

ఎదురుగా ఓ ముష్టివాడు బీడీ తాగుతూ ధర్మం చేయండని అడుక్కోసాగాడు. లల్లాదేవి వాడ్ని కసురుకుని అవతలకెళ్ళమంది. ముష్టివాడు ఏదో సణుక్కుంటూ కోపంగా సగం కాలిన బీడీని విసిరికొట్టాడు. అంతే! అప్పుడో విచిత్రం జరిగింది. ధూమేష్‌లో చిత్రమైన మార్పు వచ్చింది. సడన్‌గా మాట్లాడ్డం ఆపేసి, నాలుకతో పెదాలు తడుపుకుంటూ ఆ ఎంగిలి బీడీని ఆబగా తాగసాగాడు. చాలామంది వింతగా చూసి పడీ పడీ హేళనగా నవ్వసాగారు. లల్లాదేవి కొయ్యబారిపోయింది. ధూమేష్ వీటన్నిటికీ అతీతంగా తన్మయత్వంగా ఎంగిలి బీడీ తాగసాగాడు. ఇంతలో మరెవరో మరో బీడీని పారేసారు. ధూమేష్ మళ్ళీ అదే ఫీట్ చేసాడు. ఇంటికెళ్ళేదారి పొడువునా ధూమేష్ కనీసం అరడజను ఎంగిలి బీడీలు కాల్చాడు. అతను మరొక బ్రాండ్ అంటే సిగిరెట్, చుట్టా వగైరా జోలికిపోలేదు. అదంతా మాయామశ్చీంద్ర హిప్నాటిజం ప్రభావం అని లల్లాదేవి గ్రహించి తలపట్టుకునుండిపోయింది.

ఇక గత్యంతరలేక ఆమె రోజూ ధూమేష్‌ని "ఆ ఎంగిలి బీడీలు మానండి. కావాలంటే లక్షణంగా సిగిరెట్లు కొనుక్కుని దర్జాగా తాగండి..నా మాట వినండి..ప్లీజ్ స్మోక్ సిగిరెట్స్!" అంటూ రోజూ బ్రతిమాలుతోంది. ఆమె కోరిక ఎప్పుడు తీరుతుందో మరి.

☆

## మళ్లీ 'కెబిసి'కి షారుఖ్?

స్టార్ ప్లస్‌లో 'కౌన్ బనేగా కరోడ్‌పతి-1, 2' సీరీస్‌లకు అమితాబ్ యాంకర్ అయితే మూడో విడతకి షారుఖ్ ఖాన్ యాంకరింగ్ చేసాడు. త్వరలోనే 'కెబిసి-4'ని ఆరంభించాలని స్టార్‌వాళ్లు సన్నాహాలు చేస్తున్నారు. దీనికి అమితాబ్, అనిల్‌కపూర్, సైఫ్ అలీ ఖాన్‌ల పేర్లను పరిశీలించిన నిర్వాహకులు చివరికి షారుఖ్‌నే తీసుకోవాలని నిర్ణయించుకున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. షారుఖ్ కూడా యాంకరింగ్ చేసేందుకు రెడీగానే వున్నట్టు సమాచారం.

